
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 4 నవంబరు 2025



ప్రేమ వివాహం నచ్చక..
యువకుడి ఇంటికి నిప్పు



6
మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



ముత్తంగి జాతీయ రహదారిపై ఓవర్ లోడ్‌తో వెళ్తూ అదుపుతప్పి జాతీయ రహదారిపై డివైడర్‌ను దాటి మరోవైపుకు దూసుకువచ్చి రోడ్డు పక్కన గుంతలో దిగబడిన ట్రిప్పర్

మృత్యుశకటాలు

ఓవర్‌లోడ్, అతివేగంతో నిర్లక్ష్యంగా ప్రయాణం.. ప్రాణాలు తీస్తున్న టిప్పర్లు
డ్రైవర్ల అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు
రవాణా శాఖ అధికారుల అలసత్వం
మామూళ్ల మత్తులో మైనింగ్ శాఖ
7

రంగంపేట పీఠాధిపతి
శ్రీ మాధవానంద స్వామితో జగ్గారెడ్డి

సంగారెడ్డి రాంనగర్ రామ్‌మందిర్‌లో ఆశ్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష, సూచనలు
త్వరితగతిన ఆశ్రమానికి సంబంధించిన పనులు పూర్తిచేయాలని ఆదేశం

సంగారెడ్డి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానందస్వామితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రామ్‌నగర్ రామ్‌మందిర్‌ను సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆశ్రమంలో చేయాల్సిన ఏర్పాట్ల గురించి సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. ఆశ్రమంలో అన్ని రకాల వసతులు సమకూర్చేలా అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్తన్న, నారాయణ, తోపాజీ అనంత కిషన్, పవన్ పంతులు, కూన సంతోష్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రామ్‌నగర్ రామ్‌మందిర్‌లో శ్రీ మాధవానంద స్వామితో చర్చిస్తున్న జగ్గారెడ్డి

కళాశాలల్లో తరగతులు
నిరవధిక బంద్
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం యాజమాన్యాల చర్యలు



సంగారెడ్డిలోని మాస్టర్ కళాశాల గేటుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సంగారెడ్డి అర్బన్/నర్సాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు సోమవారం నుంచి నిరవధిక బంద్ పాటిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలో సుమారు 16 డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్‌లో పాల్గొన్నాయి. నాలుగేళ్ల నుంచి ఫీజు బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో గత్యంతర లేక బంద్ చేపడుతామని యాజమాన్యాలు పేర్కొన్నాయి. బకాయిలు పూర్తిగా చెల్లించేవరకు బంద్ కొనసాగుతుందని కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. మెదక్ జిల్లాలో ఏకైక ఇంజనీరింగ్ కాలేజీ అయిన బీవీఆర్ఐటీలో రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల అసోసియేషన్ పిలుపు మేరకు తరగతులు జరగలేదని నిర్వాహకులు తెలిపారు. రేపటి నుంచి నడపాలా వద్దా అనే విషయం ఇంకా స్పష్టత లేదని, రాష్ట్ర స్థాయిలో తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు.

రూటు మార్చి..
పోలీసులను ఏమార్చి!

ముగ్గురు ప్రైవేట్ ఉద్యోగులు.. అందరూ 30 సంవత్సరాల వయసు లోపు వారే.. జల్సాలు, సరదాలకు బానిసలయ్యారు. గంజాయికి అలవాటుపడి వచ్చే జీతం సరిపోక గంజాయి స్మగ్లర్లుగా మారారు. గుంటూరు జిల్లా భట్లూరు గ్రామానికి చెందిన దాసు సాయిశివ(26), నెల్లూరు జిల్లా సైదాపురం గ్రామానికి చెందిన మండ్రుగట్టి ప్రేమ్ (27), మెదక్ జిల్లా పెద్దశంకరంపేటకు చెందిన కోయిలకండ్ల అఖిలేష్ (26) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. అమీన్‌పూర్‌లో నివాసముంటున్నారు. గంజాయికి అలవాటుపడి జల్సాలు చేసేవారు. డబ్బు సరిపోక గంజాయి స్మగ్లర్లుగా మారారు. అరకు నుంచి హష్ ఆయిల్ కొనుగోలు చేసి చిన్న డబ్బాల్లో నింపి పటాన్‌చెరు ప్రాంతానికి తీసుకువచ్చే వారు. లింగంపల్లి, పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఇస్నాపూర్ తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో విక్రయించేవారు. 2019 మే 19వ తేదీన పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు.

హైదరాబాద్ కాటేదాన్ బృందావన్‌కాలనీకి చెందిన అనిల్‌కుమార్ యాదవ్ గంజాయి, డ్రగ్స్, హష్ ఆయిల్ వంటి మాదక ద్రవ్యాలను రవాణా చేసేవాడు. విశాఖ ఏజెన్సీ నుంచి హష్ ఆయిల్‌ను తీసుకువచ్చి సంగారెడ్డి, శంకర్‌పల్లి, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో విక్రయించేవాడు. పలుమార్లు పోలీసులకు చిక్కినా అతని తీరులో మార్పు రాలేదు. 964 గ్రాముల హష్ ఆయిల్‌ను సంగారెడ్డి నుంచి శంకర్‌పల్లికి తరలిస్తుండగా అక్టోబరు 31న ఎక్సైజ్ పోలీసులు కందిలో పట్టుకున్నారు.

విశాఖ టు హైదరాబాద్..
హష్‌ఆయిల్ వైపు స్మగర్ల చూపు!
సంగారెడ్డి జిల్లాలో నయా దందా
విద్యార్థులు, కార్మికులే టార్గెట్
తనిఖీల్లో పట్టుబడినా మారని తీరు
డ్రగ్ ఫ్రీ జిల్లాగా మారేదెన్నడో?

సంగారెడ్డి క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మత్తు కోసం స్మగ్లర్లు కొత్త ఎత్తులు వేస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తుండటంతో రూటు మార్చారు. గంజాయి నుంచి హష్ ఆయిల్‌ను తయారుచేసి చిన్న డబ్బాల్లో నింపి గుట్టుగా తరలిస్తున్నారు. అరకు, విశాఖ నుంచి ఏజెన్సీల నుంచి హైదరాబాద్ నగరానికి, సంగారెడ్డి జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో విచ్చలవిడిగా లభ్యమయ్యే హష్ ఆయిల్ (గంజాయి లిక్విడ్) నగర సమీపంలో ఉన్న సంగారెడ్డి జిల్లాలో విక్రయిస్తున్నారు. పుష్ప సినిమాల్లో చూపించిన విధంగా గంజాయి ప్యాకెట్లను వాహనాల కింద ప్రత్యేకంగా అమర్చిన విభాగాల్లో పెట్టి స్మగ్లర్లు రవాణా చేస్తున్నా పోలీసులు పట్టుకుంటున్నారు. దీంతో హష్ ఆయిల్ రవాణాపై స్మగ్లర్లు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. అరకు నుంచి హైదరాబాద్ మీదుగా సంగారెడ్డి జిల్లా శివారులోని అమీన్‌పూర్, లింగంపల్లి, రామచంద్రపురం, ఇస్నాపూర్, పటాన్‌చెరు, పాశమైలారం తదితర పారిశ్రామిక



ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. కాలేజీ విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులే టార్గెట్‌గా చేసుకుంటున్నారు. దీనికి అలవాటుపడిన అమాయకులు తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు.

డ్రగ్ రహిత జిల్లానే లక్ష్యం


సంగారెడ్డిని డ్రగ్ రహిత జిల్లాగా మార్చడం కోసం పోలీసు శాఖ కృషి చేస్తున్నది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. జిల్లాలో ఎవరైనా గంజాయి, మాదకద్రవ్యాలను సాగు, రవాణా చేసినా 8712656777 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

-పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

అమ్మ, చెల్లీ నన్ను క్షమించండి

ఆన్‌లైన్ గేమ్స్‌కు కానిస్టేబుల్ బలి
రూ.లక్షల్లో నష్టపోయి అప్పుల పాలై..
వాట్సాప్ గ్రూప్‌లో సూసైడ్ నోట్
పోలీసుశాఖలో కలకలం





సంగారెడ్డి క్రైం/కల్హేర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'సారీ.. అందరికీ.. మా అమ్మను, చెల్లినీ ఏమీ అనకండి ప్లీజ్.. నేను ఉన్నన్నీ రోజులు వాళ్లకు నరకం చూపించాను. నేను ఇంకా ఉంటే వాళ్లు ఇంకా బాధ పడుతూనే ఉంటారు. సారీ ఆల్.. సారీ అమ్మా..చెల్లీ'.. అంటూ కానిస్టేబుల్ సందీప్‌కుమార్ చివరగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి అందులో పోస్ట్ చేసిన సూసైడ్ నోట్. ఆన్‌లైన్ గేమ్స్‌కు వ్యతిరేకంగా అందరికీ అవగాహన కలిగించే పోలీసుశాఖలోకానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. మండల కేంద్రమైన కల్హేర్‌కు చెందిన కొటారి సందీప్‌కుమార్ (25) సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కల్హేర్ మండలం మాసాన్‌పల్లిలో ఆయన గతంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తుండగా, 2024లో పోలీసు రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. సందీప్ తండ్రి కొటారి సాయిలు గత పదిహేను సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అవివాహితుడైన సందీప్ తల్లి, పెళ్లి కావాల్సిన చెల్లి కల్హేర్‌లో నివాసముంటున్నారు. ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆలవాటై రూ.లక్షల్లో పోగొట్టుకున్నట్టు బంధువులు పేర్కొన్నారు. ఆత్మహత్యకు గంట ముందు సందీప్ వెల్‌విషెర్స్ పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి, సూసైడ్ నోట్ పోస్ట్ చేశాడు.

రివాల్వర్ ఎక్కడిది?

కానిస్టేబుల్ సందీప్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడానికి వినియోగించిన రివాల్వర్ ఎక్కడి నుంచి తెచ్చాడో ప్రశ్నార్థకంగా మారింది. సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లోని బ్యారక్ స్టోర్ నుంచి ఎవరికీ తెలియకుండా తెచ్చాడా? ఇతరులది వారికి తెలియకుండా తెచ్చాడా? విధుల్లో ఉండగా ఉన్నతాధికారులు అప్పగించిన రివాల్వరా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులను ప్రశ్నించగా విచారణ జరుపుతున్నామని చెప్పారు.

రేటింగ్స్‌లో వెనుకబడి



పాఠశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న ఎవల్యూటర్స్ (ఫైల్)

మెదక్ జిల్లాలో రిజిస్టర్ చేసుకున్న పాఠశాలలు 1,058
18 స్కూళ్లకే ఫైవ్‌స్టార్
రాష్ట్రస్థాయికి ఎనిమిది బడులు

మెదక్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా పాఠశాలల స్థితిగతులను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ.. ఏవమ్ హరిత విద్యాలయా'ల రేటింగ్ పేరిట కార్యక్రమం చేపట్టింది. మూత్రశాలల వినియోగం, నీటి వసతి, మొక్కలు నాటి సంరక్షణ తదితర అంశాలు పక్కాగా అమలు చేస్తున్న స్కూళ్లకు రేటింగ్ ఇచ్చింది. సెప్టెంబర్ 30 వరకు అవకాశం ఇవ్వగా జిల్లాలో 1,058 పాఠశాలలు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నాయి. ఇందులో 257 పాఠశాలలు రేటింగ్‌లో స్థానం సంపాదించాయి. వీటిలో ఫైవ్‌స్టార్స్ (అత్యుత్తమ) సాధించిన స్కూళ్లు 18, ఫోర్ స్టార్‌లో 239, మిగితా 801 పాఠశాలలు నామమాత్రపు రేటింగ్స్‌లో ఉన్నాయి.

ఎవల్యూటర్స్ పరిశీలన

ఎస్‌హెచ్‌వీఆర్ కార్యక్రమంలో భాగంగా అప్‌లోడ్ చేసిన వివరాలు, చిత్రాలను కమిటీ బృందం తనిఖీలు నిర్వహించింది. ఆయా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో కాంప్లెక్స్ హెచ్‌ఎం, సహాయకుడితో గత నెల 28 నుంచి 31 వరకు పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీల బృందం సమర్పించే నివేదికల ఆధారంగా జిల్లా స్థాయి కమిటీ గ్రామీణ ప్రాంతం నుంచి ప్రాథమిక 3, ఉన్నత పాఠశాలలు3, అర్బన్ నుంచి ప్రాథమి, ఉన్నత పాఠశాలల ఒక్కొక్కటి అత్యుత్తమమైన వాటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు.

అత్యుత్తమ కేటగిరీలో 18 మాత్రమే..

పాఠశాలల్లో ఆరు ప్రధానాంశాలను నమోదు చేసి దాన్ని బట్టి రేటింగ్ ఇచ్చారు. 60 ప్రశ్నలకు 125 మార్కులు సాధిస్తే... ఐదు స్టార్స్ ఇచ్చారు. నీటి సంరక్షణ, తాగునీటి వసతికి 22 మార్కులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, చేతుల శుభ్రతకు 27 మార్కులు, మొక్కల పెంపకానికి 14, వ్యర్థాల నిర్వహణ 21, విద్యుత్ పొదుపు, సోలార్ వినియోగానికి 20, పర్యావరణ పరిరక్షణ అవగాహనకు 21 స్కోరింగ్ మార్కుల ఆధారంగా రేటింగ్స్ ఇచ్చారు. మెదక్ జిల్లాలో ఫైవ్‌స్టార్(అత్యుత్తమ) సాధించిన స్కూళ్లు 18 ఉన్నాయి. పచ్చదనం, నీటి పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణలో ఫోర్త్‌స్టార్(4స్టార్)లో 239 ఉన్నాయి. 625 స్కూళ్లకు 3 స్టార్ రేటింగ్, 138 పాఠశాలలకు 2 స్టార్ రేటింగ్, 38 స్కూళ్లకు 1 స్టార్ రేటింగ్స్ ఇచ్చారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ వాటిని పరిశీలించి అర్బన్ నుంచి 2, గ్రామీణ ప్రాంతం నుంచి 6 పాఠశాలలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపనుంది.

సంగారెడ్డి జిల్లాలో 22 స్కూళ్లకు..

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో 22 పాఠశాలలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ వచ్చాయి. జిల్లాలో 1,548 పాఠశాలలు హరిత విద్యాలయాల రేటింగ్‌కు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోగా, అందులో 22 పాఠశాలలు ఫైవ్‌స్టార్, 309 స్కూళ్లు ఫోర్‌స్టార్ రేటింగ్‌లో చోటు దక్కించుకున్నాయి. ఫైవ్‌స్టార్, ఫోర్ స్టార్ రేటింగ్‌లో చోటు దక్కించుకున్న మొత్తం 311 పాఠశాలల నుంచి ఎనిమిది పాఠశాలలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి ఆరు స్కూళ్లు, పట్టణ ప్రాంతాల నుంచి రెండు స్కూళ్లు ఎంపిక చేస్తారు.



అందుబాటులోకి 'క్రిటికల్ కేర్'

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.24 కోట్లతో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగం ఎట్టకేలకు సోమవారం నుంచి అధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. పాత అత్యవసర విభాగాన్ని మూసేసి క్రిటికల్ కేర్ విభాగం నుంచే అత్యవసర చికిత్సలు ప్రారంభించారు. క్రిటికల్ కేర్ విభాగం తెరుచుకోని వైనంపై 'మంత్రి ప్రారంభించినా.. వినియోగంలోకి రాలే' అనే శీర్షికతో గత నెల 16న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇటీవల ఆస్పత్రిని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సందర్శించి రెండు రోజుల్లో క్రిటికల్ కేర్ విభాగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో ఆస్పత్రి అధికారులు స్పందించి క్రిటికల్ కేర్ విభాగాన్ని రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

సంగారెడ్డి జిల్లాలో కామన్ రివ్యూ మిషన్

రెండు బృందాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రల పరిశీలన



కంగ్టి మండలం తడ్కల్ పీహెచ్‌సీలో కేంద్ర బృందం తనిఖీలు

సంగారెడ్డి అర్బన్/కంగ్టి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో కామన్ రివ్యూ మిషన్ బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఆరుగురు సభ్యులతో కూడిన కామన్ రివ్యూ మిషన్ బృందం రెండు బృందాలుగా విడిపోయి పలు ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఓ బృందం జిల్లాలోని కంగ్టి పీహెచ్‌సీ, తడ్కల్ సబ్‌సెంటర్, దామర్‌గిద్ద సబ్ సెంటర్, నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. మరో బృందం ఆత్మకూర్ పీహెచ్‌సీ, నందికంది సబ్‌సెంటర్, తంగడ్‌పల్లి సబ్ సెంటర్‌తో పాటు సదాశివపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలు, జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల వినియోగం, ఖర్చు, ఎన్‌సీడీ స్క్రీనింగ్, రికార్డుల నిర్వహణ, ఐఈసీ తదితర కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు అంశాలను క్షుణంగా పరిశీలించారు. కాగా మంగళవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు రామచంద్రాపురం పీహెచ్‌సీని కేంద్ర బృందం సందర్శించనున్నదని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సంధ్యారాణి, జగన్నాథ్‌రెడ్డి, శశాంక్‌దేశ్‌పాండే, వైద్యురాలు నాగమణి, డాక్టర్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూంవాసులకు వరాల జల్లు

విద్య, వైద్యానికి పెద్దపీట : మంత్రులు

రామచంద్రాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరు డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలకు మంత్రులు వరాల జల్లు కురిపించారు. ఇక్కడ వీఎస్టీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో 60 గదులతో నిర్మిస్తున్న పాఠశాల భవన సముదాయానికి సోమవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులు లబ్దిదారుల సమస్యలు ఓపికగా విన్నారు. కొన్ని సమస్యలకు మంత్రి పొంగులేటి అక్కడే పరిష్కరించారు. ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్యకు వేదికపై నుంచే సూచనలిచ్చారు. అలాగే, రూ. 8 కోట్లతో పాఠశాల భవనంతోపాటు క్రీడా ప్రాంగణం, శ్మశాన వాటికకు వసతులు కల్పిస్తామని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతోపాటు, విద్యుత్ బిల్లులు జారీ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. పది రోజుల్లో డబుల్ బెడ్‌రూం సముదాయాల వారి కోసం అక్కడే రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆరు పడకలతో ఆరోగ్య కేంద్రం, అందులో అవసరమైనంత మంది సిబ్బంది, రెండు 108 అంబులెన్స్‌లు, బ్లాక్‌ల వారీగా సొసైటీల ఏర్పాటు, పది రోజుల్లో ఈ ప్రాంతానికి ఆర్టీసీ బస్సుల పెంపు, పెట్రోల్ బంక్, పోస్టాఫీసు ఏర్పాటు వంటి హామీలు ఇచ్చారు. అలాగే, ప్రార్థనా మందిరాల నిర్మాణాలకు స్థల సేకరణ, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణంతో పాటు అవుట్‌పోస్టు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యానికి, విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ ఎండీ గౌతం, సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సరస్వతి, కమిషనర్ అజయ్‌రెడ్డి, మేనేజర్ అఖిల్, సీఐలు గణేష్ పటేల్, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, కలెక్టర్

జూబ్లీహిల్స్ ఎన్నికల కోసమేనా...?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలోనే మంత్రులు డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయానికి సకల సౌకర్యాలు కల్పిస్తామని హామీలు గుప్పించారని అంటున్నారు. ఇక్కడ జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన సుమారు 5 వేలకు పైగా ఓటర్లు ఉన్నారనే సమాచారంతోనే భారీ కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

వృద్ధుల కోసం ఏర్పాట్లు చేయలేరా?
'ప్రజావాణి'లో సిబ్బంది తీరుపై సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అసహనం
7

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి
అమీన్‌పూర్ అర్బన్‌రైజ్ అపార్ట్‌మెంట్ క్లబ్‌హౌజ్‌లో దారుణం
6

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు
11 మంది అరెస్టు, రిమాండ్
రూ.3 లక్షల నగదు, 18 బ్యాటరీలు రికవరీ
6



అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- పగలు రెక్కీ..రాత్రి సమయాల్లో సెల్‌టవర్ బ్యాటరీలు, డీజిల్ దొంగతనాలు
- 11 మంది నిందితుల అరెస్టు, రిమాండ్
- రూ.3 లక్షల నగదు, 18 బ్యాటరీలు రికవరీ
- వివరాలు వెల్లడించిన సీపీ విజయ్‌కుమార్

సిద్దిపేట క్రైం, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సెల్ టవర్ బ్యాటరీలు, డీజిలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠా సభ్యులు ఐదుగురిని, వాటిని కొనుగోలు చేసిన మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ విజయ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెంద్రుగుండ మండలం అయ్యన్నపాలెంకు చెందిన బత్తుల గురుస్వామి బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ ఖర్చులకు డబ్బులు సరిపోవడం లేదని గతంలో ఆటో బ్యాటరీల దొంగతనాలకు పాల్పడగా పోలీసులు కేసులు నమోదు చేశారు. అదే అనుభవంతో సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో సెల్ టవర్‌లో బ్యాటరీలు దొంగతనం చేస్తే ఎవరూ పట్టించుకోరని, బయట దూర ప్రాంతాల్లో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. గురుస్వామి, అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్లు బత్తుల సాయిరాం, అలకుంట శంకర్, ట్రాక్టర్ డ్రైవర్ అలకుంట లక్ష్మణ్, సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో ఇటుకబట్టీల వ్యాపారం చేసే బత్తుల శ్రీనులతో కలిసి పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో సెల్ టవర్‌ల బ్యాటరీలు, డీజిల్ దొంగతనం చేసేవారు. దొంగిలించిన బ్యాటరీలను ఆటోలో పోసాన్‌పల్లికి చెందిన స్క్రాప్ వ్యాపారం చేసే పుట్ట ఆంజనేయులుకు విక్రయించి వచ్చిన డబ్బులు పంచుకునే వారు. గత రెండేళ్లుగా సిద్దిపేట జిల్లాలోని పలు గ్రామ శివార్లలోని 16 సెల్ టవర్లలోని బ్యాటరీలు, డీజిల్ దొంగతనాలకు పాల్పడ్డారు. అదేవిధంగా రాచకొండ, జగిత్యాల, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వరంగల్, జనగాం, మహబుబాబాద్ జిల్లాల పరిధిలో 33 వరుస దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దొంగిలించిన బ్యాటరీలు పుట్ట ఆంజనేయులుకు విక్రయించగా అతడు నాగపూరికి చెందిన నూనె మహేందర్ నాలుగు, జోగు మహేష్‌కు నాలుగు, ఎండీ హజీమ్‌కు మూడు, శిలసాగరం రామచంద్రంకు మూడు బ్యాటరీలు విక్రయించారు. దొంగిలించిన డీజిల్‌ను గురువన్నపేటకు చెందిన బండారు శ్రీనివాస్‌కు విక్రయిస్తూ వచ్చిన డబ్బును అందరూ పంచుకునేవారు. జిల్లాలోని తొగుట, బేగంపేట, రాయపోల్ పోలీసుస్టేషన్‌లల్లో గతంలో నమోదైన కేసుల్లో సీపీ పర్యవేక్షణలో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, తొగుట సీఐ లతీఫ్, సీఐ అంజయ్య, ఎస్‌ఐలు రవికాంతరావు, మానస, అరుణ్‌కుమార్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు.

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి

- అమీన్‌పూర్ అర్బన్‌రైజ్ అపార్ట్‌మెంట్ క్లబ్‌హౌజ్‌లో దారుణం


అపార్ట్‌మెంట్‌లో చిన్నారులు మృతి చెందిన స్విమ్మింగ్‌పూల్

అమీన్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ క్లబ్‌హౌజ్‌లోని స్విమ్మింగ్‌పూల్ ఇద్దరు చిన్నారుల పాలిట మృత్యుకుహరంగా మారింది. సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీట మునిగి ఊపిరాడక అపస్మారకస్థితిలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పట్టణం హెచ్‌ఎంటీ స్వర్ణపురికాలనీలోని అర్బన్ రైజ్ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకున్నది. అపార్ట్‌మెంట్ 925ఫ్లాట్‌లో నివాసం ఉండే షణ్ముకకుమార్, ప్రతిమ దంపతుల కుమార్తె ప్రజ్ఞ(9), ఫ్లాట్ నంబర్ 906లో నివాసం ఉండే విజయ్ రెడ్డి, లోకేశ్వరీ కుమార్తె అద్వికరెడ్డి(8) ఆదివారం సాయంత్రం క్లబ్ హౌజ్ స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు దిగారు. ముందు తక్కువ లోతు ఉన్న కిడ్స్‌పూల్‌లో ఈత కొట్టి కొద్దిసేపటికి పెద్దస్విమ్మింగ్‌పూల్‌లోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక నీట మునిగిపోయారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న చిన్నారులను అక్కడే ఉన్న కొందరు గుర్తించి బయటకు తీశారు. అపస్మారకస్థితిలో ఉన్న ప్రజ్ఞను మియాపూర్ లోటస్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. అద్వికను కొండాపూర్ హోలిస్టిక్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తెల్లవారు జామున రెండుగంటలకు అద్విక మృతిచెందింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న షణ్ముకకుమార్‌ది వైజాగ్ కాగా, విజయ్‌రెడ్డిది ఎన్‌టీఆర్ కృష్ణ జిల్లా ఇబ్రహింపట్నం. మృతిచెందిన ప్రజ్ఞ అమీన్‌పూర్ సూర్యగ్లోబల్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతుండగా, అద్వికరెడ్డి చందానగర్ జెనెసిస్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. ఈ మేరకు అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారుల మృతదేహాలకు పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.


ప్రజ్ఞ (ఫైల్)


అద్విక (ఫైల్)

నిర్లక్ష్యమే కారణం

గేటెడ్ కమ్యూనిటీ క్లబ్‌హౌజ్‌లోని అపార్ట్‌మెంట్ నిర్వహణ బాధ్యత అర్బన్‌రైజ్ బిల్డర్ యాజమాన్యంపైనే ఉండగా ప్రమాదం పొంచి ఉండే ఈతకొలను వద్ద కేర్‌టేకర్లను నియమించకపోవడం వల్లే చిన్నారులు మృతిచెందారని అపార్ట్‌మెంట్‌వాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధిత తల్లిదండ్రులు సైతం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నారులను కనిపెట్టుకుని ఉండాల్సిన వారు ఎవరూ లేకపోవడం, అక్కడ ఉన్న తల్లిదండ్రులు సైతం ఇంత దారుణం జరుగుతుందని ఊహించకపోవడం తదితర కారణాల వల్ల చిన్నారుల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయి తీవ్ర విషాదం నింపింది. కొంతసేపు మినీ స్విమ్మింగ్‌పూల్‌లోనే ఈత కొట్టిన చిన్నారులు అకస్మాత్తుగా పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకడం వల్లే ఈ దారుణం చోటుచేసుకుందని భావిస్తున్నారు. అక్కడే ఉన్న సీసీటీవీలను సైతం పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. స్విమ్మింగ్‌పూల్ నిర్వహణ గాలికి వదిలేసి చిన్నారుల మృతికి కారణమైన అర్బన్ రైజ్ యాజమాన్యంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పేర్కొన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


ప్రేమ వివాహం నచ్చక.. యువకుడి ఇంటికి ఇంటికి నిప్పు

ఝరాసంగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ ఇంటి ఆడబిడ్డను ప్రేమ వివాహం చేసుకోవడం నచ్చని ఆమె కుటుంబసభ్యులు అత్తింటికి నిప్పు పెట్టారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధి కక్కర్‌వాడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని రాధాకృష్ణ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన విఠల్ కుమార్తె మౌనికను పది రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే, తమ ఇంటి ఆడబిడ్డను ప్రేమ వివాహం చేసుకుని.. రాధాకృష్ణ కుటుంబసభ్యులు కళ్ల ముందే తిరుగుతుండటం మౌనిక కుటుంబసభ్యులకు నచ్చలేదు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని సోమవారం ఉదయం రాధాకృష్ణ తండ్రి బోయిని రాములు పనులు చేసుకుంటుండగా, మౌనిక కుటుంబ సభ్యులు వచ్చి దాడి చేశారు. అలాగే, ఇంటికి నిప్పు పెట్టారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక సిబ్బందికి విషయం చెప్పడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. రాధాకృష్ణ సోదరుడు బోయిన నాగేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.











రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల శివారు చోటు సోమవారం చేటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన తిరుపతి కృష్ణ(37) మెదక్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇంటి నుంచి మెడికల్ షాపుకు నడుచుకుంటూ వెళ్లి, తిరిగి వస్తున్న క్రమంలో మెదక్ బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఆఫీసు సమీపంలో వెనుక వైపు నుంచి వచ్చిన బైక్ బలంగా ఢీ కొట్టింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

- మృతదేహంపై నుంచి ఇతర వాహనాలు

మాసాయిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. మృతదేహం రోడ్డుపై పడి ఉండగా, వెనుక నుంచి వచ్చిన వాహనాలు పై నుంచి వెళ్లడంతో సదరు వ్యక్తి నుజ్జునుజ్జు అయ్యాడు. మెదక్ జిల్లా మాసాయిపేట వద్ద 44 జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ఈ రోడ్డు ప్రమాద వివరాలు చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని 44 జాతీయ రహదారిపై మసాయిపేట గోశాల వద్ద సుమారు 45 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన రాత్రి వేళ చోటు చేసుకోవడంతో మృతదేహం రోడ్డుపైనే పడి ఉండగా, వెనుక నుంచి వచ్చిన కొన్ని వాహనాలు పై నుంచి వెళ్లాయి. దీంతో మృతదేహం గుర్తుపట్టలేనంతగా నుజ్జునుజ్జు అయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొండాపూర్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకున్నది. కొండాపూర్ ఎస్‌ఐ సోమేశ్వరీ వివరాల ప్రకారం... కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 35-40 ఏళ్ల వయసు కలిగిన ఒకరు మునిదేవునిపల్లి శివారులో రోడ్డు పక్కన మూడు రోజుల నుంచి తిండి లేకుండా కదలలేని స్థితిలో పడిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో ఆదివారం సాయత్రం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి వివరాల తెలిసిన వారు ఫోన్ నంబర్లను 8712656748, 8712656722 సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అక్కన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పెట్రోలింగ్ పోలీసులు సోమవారం పట్టుకొని అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఎస్‌ఐ ప్రశాంత్ తెలిపారు. మండలంలోని గౌరవెల్లిలో కొన్ని నెలలుగా మట్టిని ఫిల్టర్ ఇసుకగా మారుస్తూ నాసిరకం ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని అక్టోబరు 4న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పోలీసులు నిఘా పెట్టి సోమవారం బోడిగపల్లి స్టేజి వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ ప్రశాంత్ తెలిపారు.

అటవీ భూమి ఆక్రమణ.. వ్యక్తిపై కేసు నమోదు

శివ్వంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అటవీ భూమి ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, అందులోని ఇసుక డంప్‌ను సీజ్ చేసిన ఘటన పాంబండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. అటవీ శాఖ సెక్షన్ అధికారి భూపతి తెలిపిన వివరాల మేరకు.. తూప్రాన్ రేంజ్ మంగల్‌పర్తి పరిధిలోని పాంబండ అటవీ స్థలంలో ఇసుక డంపును ఏర్పాటు చేసుకుని రాత్రి వేళ టిప్పర్‌లో తరలిస్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఇటీవల పోలీసులు డంపును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయినా రవాణాను ఆపలేదు. సోమవారం పోలీసులు దాడి చేయగా, భారీగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేశారు. సదరు డంపింగ్ అటవీ భూమిని చదును చేసిన కొత్త రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఎస్‌వో భూపతి తెలిపారు.

ముప్పిరెడ్డిపల్లిలో కల్లు దుకాణంపై కేసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనోహరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. పుట్టగొడుగుల్లా కల్లు దుకాణాలు వెలిశాయని 'ఆంధ్రజ్యోతి'లో కల్తీ గమ్మత్తు శీర్షికతో సోమవారం కథనం పచురితమైంది. స్పందించిన నర్సాపూర్ ఎస్‌హెచ్‌వో ఎక్సైజ్ అధికారులు మనోహరాబాద్ మండలంలోని కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ముప్పిరెడ్డిపల్లితో పాటు మండలంలోని కాళ్లకల్, కూచారంలోనూ కల్లు దుకాణాలను తనిఖీలు చేశారు.

రాజీ చేయదగిన కేసులను పరిష్కరించండి

● సంగారెడ్డి ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15వ తేదీన జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌లో అవకాశం ఉన్న ప్రతీ కేసును రాజీ కుదుర్చాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర సూచించారు. జిల్లా కోర్టులో సోమవారం న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భార్యాభర్తల వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు కేసులతో పాటు రాజీ చేయదగ్గ కేసులలో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చని అన్నారు. క్షణికావేశంలో ఇరువర్గాలు చిన్న తగాదాలు పడి కేసులు నమోదు జరిగి కోర్టు చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కోర్టులో తమపై ఉన్న కేసులను రాజీ చేసుకొని సామరస్యంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈనెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, న్యాయాధికారులు ఆర్.అనిత, కె.ధనలక్ష్మి, దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

పర్కపెల్లి యాదగిరి కథకు బహుమతి



పర్కపెల్లి యాదగిరి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వహించిన కథల పోటీలో సిద్దిపేట కథకుడు పర్కపెల్లి యాదగిరి రచించిన చావు కథకు బహుమతి లభించిందని వెన్నెల సాహితీ సంఘం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. నవంబరు 22, 23న విజయవాడలో నిర్వహించనున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో పర్కపెల్లి యాదగిరిని నగదు బహుమతితో సత్కరిస్తారని పేర్కొన్నది. ఈ సందర్భంగా వెన్నెల సాహితీ సంఘం సభ్యులు వంగర నరసింహారెడ్డి, కొండి మల్లారెడ్డి, మహమూద్ పాషా, అశోకరాజు తదితరులు యాదగిరిని అభినందించారు.

కేతకీలో కేంద్ర మాజీ మంత్రి భగవత్ పూజలు



సంగమేశ్వర ఆలయంలో మాజీ మంత్రి

ఝరాసంగం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కేంద్ర మాజీ మంత్రి భగవత్ కుభా కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారితో స్వామి వారికి అభిషేక కార్యక్రమాలను చేయించారు. ఆలయ ఈవో శివరుద్రప్ప వారిని శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా వరంగల్ జిల్లా అదనపు ఎస్పీ నల్లమల్ల రవి కుటుంబసమేతంగా ఆలయంలో పూజలు చేశారు.

సమ్మిళిత వృద్ధికి అవకాశాలు అందించడమే లక్ష్యం

సుజుకీ మోటార్ కార్పొరేషన్ గ్లోబల్ మార్కెటింగ్ కౌన్సిలర్ కింజి సైటో


కంది, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో దేశ యువతను ఆచరణాత్మక నైపుణ్యాలతోపాటు సమ్మిళిత వృద్ధి వైపు నడిపించే అవకాశాలను అందించడమే తమ లక్ష్యమని సుజుకీ మోటార్ కార్పొరేషన్ గ్లోబల్ మార్కెటింగ్ కౌన్సిలర్ కింజి సైటో అన్నారు. ఐఐటీహెచ్‌లో ప్రారంభమైన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌పై సోమవారం ఆయన మాట్లాడుతూ ఇది సమగ్ర నైపుణ్యాభివృద్ధికి కేంద్రంగా పనిచేస్తుందని, యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కమ్యూనికేషన్ సామర్థ్యాలను మెరుగుపరిచే కార్యక్రమాలను అందించనున్నదని వెల్లడించారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్. మూర్తి మాట్లాడుతూ వినూత్న సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా గ్రామీణాభివృద్ధికి దోహదం చేయాలనే ఉద్దేశంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కోసం స్థల సేకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనోహరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుపాకులపల్లిలో కొన్నేళ్లుగా చెట్ల కిందనే కొనసాగుతున్న అంగన్‌వాడీకి స్థలం సేకరణ కోసం సోమవారం మండల సూపర్‌వైజర్ మెహతా బేగం, గ్రామపెద్దలు ముందుకు వచ్చారు. మండలంలో 'అంగన్‌వాడీలు అధ్వానం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామంలోని కొంత స్థలం అంగన్‌వాడీ భవనం కోసం ఇవ్వడానికి అంగీకరిస్తున్నామని గ్రామ పెద్దలు, గ్రామ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఒప్పంద పత్రం రాశారు. ప్రభుత్వం తరఫున గ్రామంలో వెంటనే భవనం నిర్మించాలని మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేహతబేగంకు విన్నవించారు. కలెక్టర్‌కు, చేరవేసి భవనం నిర్మించే విధంగా చూస్తామని ఆమె గ్రామస్థులకు తెలిపారు.

రామవరం పీహెచ్‌సీలో రోగులకు ఇబ్బందులు



పీహెచ్‌సీలో ఖాళీగా వైద్యుడి కుర్చీ

అక్కన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జ్వరం వచ్చిందని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే.. అక్కడ వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడిన సంఘటన అక్కన్నపేట మండలం రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. ఇక్కడి పీహెచ్‌సీ రెగ్యులర్ వైద్యుడు డాక్టర్ వినోద్‌రెడ్డి అక్టోబరు 30 నుంచి పది రోజులపాటు సెలవులో వెళ్లారు. హుస్నాబాద్ ఆయుష్ మెడికల్ ఆఫీసర్ తులసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సోమవారం పూజ ఉందని ఆమె కూడా సెలవు పెట్టింది. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. స్టాఫ్‌నర్సు మేరీ రోగులకు టాబ్లెట్లు ఇచ్చి పంపించారు. ఎవరైనా బాగా ఇబ్బంది ఉందని వస్తే సెల్‌ఫోన్‌లో వైద్యులను సంప్రదించి చికిత్స చేస్తానని స్టాఫ్‌నర్స్ మేరీ చెప్పడం గమనార్హం. ప్రతీ రోజు ఈ ఆసుపత్రికి 50 నుంచి 60 మంది రోగులు వస్తారని ఆమె తెలిపారు. వైద్యం కోసం వస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రామవరం గ్రామానికి చెందిన పొన్న కరుణాకర్ తెలిపారు.

డీవోఏ, డీఎంఐటీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ (డీవోఏ), డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సు(డీఎంఐటీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను రెండు సంవత్సరాల పారా మెడికల్ కోర్సులకు సంబంధించి ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను, కళాశాలను సంప్రదించాలని ఆయన కోరారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పొడగింపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్లు పొందాలనుకునే వారు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు ఉమ్మడి జిల్లా వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 8వ తెలంగాణ సీనియర్ అంతర్ జిల్లా వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నారు. సిద్దిపేట వాలీబాల్ అకాడమీ క్రీడా మైదానంలో బుధవారం పురుషుల, మహిళ జట్లను ఎంపికలు చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శుల సమక్షంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ ఒరిజినల్, ఒక జిరాక్స్ కాపీ తీసుకొని సిద్దిపేట స్టేడియంకు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.



మృత్యుశకటాలు

ప్రాణాలు తీస్తున్న టిప్పర్లు

- ఓవర్‌లోడ్, అతివేగంతో నిర్లక్ష్యంగా టిప్పర్ల దూకుడు
- అధికారుల కంటపడకుండా గమ్యస్థానాలకు చేరడమే లక్ష్యం
- డ్రైవర్ల అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు
- రవాణా శాఖ అధికారుల అలసత్వం
- మామూళ్ల మత్తులో మైనింగ్ శాఖ

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై గండిపేట వైపు వెళ్తున్న భిక్షపతి కారు పాటి సమీపంలో టిప్పర్‌ను ఢీకొట్టిన ఘటన జూన్ 9న చోటుచేసుకున్నది. ఈ ఘోర ప్రమాదంలో భిక్షపతి కుమార్తె వైష్ణవి అక్కడికక్కడే మృతిచెందగా, భిక్షపతి, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.

సదాశివపేటకు చెందిన గిరి వనస్థలిపురం వెళ్లేందుకు కారులో వెళుతూ ఓఆర్ఆర్‌పైకి ఎక్కాడు. టిప్పర్‌ను ఢీకొనడంతో ప్రమాదానికి గురై మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన మార్చి 21న చోటుచేసుకున్నది.

2020లో మార్చిలోనూ లక్డారం గ్రామానికి చెందిన మాచన్నగారి వెంకటరామిరెడ్డి(25) అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన రామిరెడ్డి (30) కూడా గతంలో టిప్పర్ ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయాడు.

లక్డారం చౌరస్తా, 65వ నంబర్ జాతీయ రహదారి, ఔటర్‌పై జరిగిన టిప్పర్ ప్రమాదాల్లో అమాయక ప్రజలు అసువులు బాసిన సంఘటనలు అనేకం. తాజాగా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దాదాపు 20 మంది మృతికి కారణమైన టిప్పర్ కూడా సంగారెడ్డి జిల్లా లక్డారం సమీప గ్రామం బ్యాతోల్ నుంచే వెళ్లిందన్న సంగతి స్థానికులను తీవ్ర కలవరపాటుకు గురిచేసింది.

పటాన్‌చెరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో నిర్మాణ రంగం భారీ స్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో, లక్డారం ప్రాంతం నుంచి వందలాది వాహనాల్లో నిత్యం తరలివెళ్తున్న కంకర, డస్ట్ లోడుతో కూడిన టిప్పర్లు(డంప్ ట్రక్‌లు) రహదారులపై మృత్యుశకటాల్లా దూసుకుపోతున్నాయి. అతివేగం, అజాగ్రత్త, దారుణమైన ఓవర్‌లోడ్‌తో నడుస్తున్న ఈ టిప్పర్ల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని మిగులుస్తున్నాయి. ఇంటి యజమానులు, యువకులు మృత్యువాత పడటంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడి, ఆర్థికంగా, మానసికంగా చితికిపోతున్నాయి.

మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తూ

ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం మైనింగ్ మాఫియా, వారిపై పర్యవేక్షణ లేకపోవడమేనని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. పటాన్‌చెరు రూరల్ పరిధిలోని లక్డారంలో భారీగా క్రషర్లను ఏర్పాటు చేసేందుకు మైనింగ్ మాఫియా ప్రజాభిప్రాయ సేకరణలను సైతం తప్పుదోవ పట్టించింది. తమకు అనుకూలంగా ఉన్న ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలను రంగంలోకి దింపి క్రషర్లను ఏర్పాటు చేసుకున్నారు. గతంలో కేసులు నమోదు చేసిన అధికారులు, రాజకీయ కారణాల తర్వాత మామూళ్ల మత్తులో మౌనంగా ఉండిపోయారన్న ఆరోపణలున్నాయి. మైనింగ్‌శాఖ నుంచి ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో, ఎంత మెటీరియల్ వెళ్తుంది, ఎంత పన్ను కడుతున్నారు అనే నిఘా పూర్తిగా కరువైంది. మైనింగ్‌శాఖ అధికారులు తూతూమంత్రపు తనిఖీలు చేస్తూ క్రషర్ల, టిప్పర్ల యజమానులకు సహకరిస్తున్నారని చుట్టుపక్కల గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టాల్సిన రవాణా శాఖ అధికారులు కూడా టిప్పర్ల వారీగా వసూళ్లకు పాల్పడుతూ, నామమాత్రపు జరిమానాలు వేసి చేతులు దులుపుకుంటున్నారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. వందలాది టిప్పర్ల వల్ల ఆర్అండ్‌బీ రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయి.

లాభం కోసం ప్రాణాలను బలి

టిప్పర్ల యజమానులు తమ లాభం కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఒక్కో టిప్పర్ సామర్థ్యం 30 టన్నులు ఉండగా, వారు ఏకంగా 60 టన్నుల వరకు కంకర, డస్ట్‌ను ఓవర్‌లోడ్ చేసి తరలిస్తున్నారు. ఈ అధిక లోడు వల్ల టిప్పర్ యజమానులకు రెట్టింపు ఆదాయం సమకూరడంతో పాటు డీజిల్, లేబర్ ఖర్చులు కలిసి వస్తున్నాయి. వేబిల్లు ప్రకారం అనుమతించిన బరువుతో సరఫరా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. రెండు ట్రిప్పుల్లో వెళ్లాల్సిన లోడ్‌ను నిబంధనలను తుంగలో తొక్కి, తమ లాభాలను పెంచుకోవడానికి అధిక లోడుతో వాహనాలను నింపి తరలిస్తున్నారు. ఇదే సమయంలో హడావిడిగా టిప్పర్లను నడిపిస్తూ రోడ్డు ప్రమాదాలకు మూల కారణమవుతున్నారు. అంతేకాకుండా, అధికారుల కంట పడకుండా గమ్యస్థానం చేరుకోవాలనే ఒత్తిడిని యజమానులు టిప్పర్ డ్రైవర్లపై పెడుతున్నారు. దీని కారణంగానే డ్రైవర్లు విపరీతమైన వేగంతో దూసుకుపోతూ తరుచూ ప్రమాదాలకు కారకులవుతున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. టిప్పర్లతో వరుసగా జరుగుతున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని, వాటిని నివారించేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలి అని పలువురు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

బ్యాతోల్ క్వారీ నుంచే బయలుదేరిన టిప్పర్ లోడ్..

చేవెళ్ల పరిధి మీర్జాగూడ సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్ లక్డారం సమీపంలో బ్యాతోల్‌లో ఉన్న ఎస్ఎంఎస్ క్వారీలోనే లోడ్ అయింది. ఓవర్ లోడ్‌తో వెళుతున్న టిప్పర్లన్నీ వేకువ జామునే బయలుదేరి, అధికారులు విధులకు రాకముందే తమ గమ్యాలకు చేరుతాయి. మీర్జాగూడ ప్రమాదంతో అధికారులు దాడులు చేస్తారని ముందు జాగ్రత్తతో టిప్పర్, క్రషర్ యజమానులు రవాణాను బంద్ పెట్టడంతో సోమవారం లక్డారంలో ప్రశాంత వాతావరణ నెలకొంది.

మెదక్ జిల్లాలో టిప్పర్ల ప్రమాదాలు

మెదక్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని వెల్దుర్తి మండలం ఎల్కపల్లి, బండపోసాన్‌పల్లిలో, మాసాయిపేట మండలం రామాంతపూర్, తూప్రాన్ మండలం ఘనపూర్‌లో మూడు, కొల్చారం మండలం రాంపూర్‌లో కంకర క్వారీలు ఉన్నాయి. వీటి నుంచి రోజూ టిప్పర్లు ఓవర్ లోడ్ చేసుకుని మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం దీపావళీ టపాసుల కోసం హోంగార్డ్ భార్య, తన ఇద్దరు చిన్నారులతో స్కూటీపై వెళుతుండగా, మెదక్ కేర్ ఆసుపత్రి ఎదురుగా వెనక నుంచి టిప్పర్ ఢీకొనడంతో వారంతా మృత్యువాత పడ్డారు. గతేడాది మెదక్ రామ్‌దాస్‌చౌరస్తా సిగ్నల్ వద్ద పాదచారిని టిప్పర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. బాల్‌నగర్ - బోధన్ జాతీయ రహదారి మెదక్ పట్టణం మీదుగా వెళ్తుండడంతో మెదక్ రోడ్ల గుండా భారీ వాహనాలు వందలాదిగా ప్రయాణిస్తున్నాయి. పట్టణానికి బైపాస్ రోడ్డు లేకపోవడంతో ప్రమాదాలూ అధికమయ్యాయి.

పటాన్‌చెరులో ప్రొటోకాల్ రగడ

● ఎమ్మెల్యే వర్సెస్ మంత్రి

పటాన్‌చెరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్ని అధికారిక కార్యక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధి పర్యవేక్షణలో ప్రొటోకాల్ నిబంధన మేరకు నిర్వహించాలని, లేదంటే అధికారులు హాజరుకాకూడదన్న నిబంధన పటాన్‌చెరులో అమలు కావడం లేదు. స్థానిక ఎమ్మెల్యేకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మంత్రులతో ప్రారంభోత్సవాలు నిర్వహిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులోని డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయంలో రూ.10 కోట్ల వ్యయంతో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణానికి వీఎస్టీ అనే సంస్థ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద ముందుకు వచ్చింది. ఇందుకు సంబంధించి ముందస్తు సమాచారం ఎమ్మెల్యేకు ఇవ్వలేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో హౌసింగ్, మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి నిర్మాణ పనులపై నిత్యం సమావేశాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టర్ ప్రావీణ్య, హౌసింగ్ ఎండీ గౌతమ్ కొల్లూరులో పర్యటించారు. సోమవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్, దామోదర్ రాజనర్సింహ వస్తున్నారంటూ అధికారులు ప్రకటించి ఆహ్వానపత్రికలు పంచారు. డీఈవో వెంకటేశ్వర్లు ద్వారా ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే నిలదీశారు. ఎమ్మెల్యే రాకపోయినా మంత్రులు, కలెక్టర్ కార్యక్రమాన్ని ముగించారు. గతంలోనూ అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి కిష్టారెడ్డిపేటలో ఎక్సైజ్ కార్యాలయం శంకుస్థాపనకు మంత్రులు దామోదర్, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావును ఆహ్వానించగా ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యే నిలదీయడంతో అప్పటి కలెక్టర్ క్రాంతి కార్యక్రమాన్ని రద్దు చేశారు. సుల్తాన్‌పూర్ డివైజ్ పార్కు, రుద్రారం తోషిబా పరిశ్రమ ప్రారంభం వంటి సందర్భాల్లో సైతం ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు.

సీఎన్‌జీ ఆటో దగ్ధం



కోహీర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు(డి)గ్రామం వద్ద సోమవారం సీఎన్‌జీ ఆటో దగ్ధమైంది. మహారాష్ట్రలోని లాతూర్ నుంచి హైదరాబాద్‌కు ఇద్దరు సీఎన్‌జీ ఆటోలో వెళ్తున్నారు. మండలంలోని కొత్తూరు(డి) గ్రామం వద్ద సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఆటోను రోడ్డు పక్కన ఆపి, టీ తాగుతుండగా, ఆటోలో నుంచి పొగలు వచ్చి, ఆటో మొత్తం కాలిపోయింది. జహీరాబాద్ ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.

బొగ్గుబట్టీలకు పచ్చని చెట్లు



కుందనవానిపల్లిలో నరికి వేసిన చెట్లు

అక్కన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తుండగా.. కొందరు వాటిని నరికి బొగ్గుబట్టీలకు.. సామిల్లులకు తరలిస్తున్నారు. మండలంలోని కుందనవానిపల్లి వైకుంఠధామం ఎదురుగా ఉన్న పెద్ద పెద్ద చెట్లను కొందరు సోమవారం నరికి తరలించారు. వాటిని జనగామ, చేర్యాల, మద్దూరు, సిద్దిపేటలోని బొగ్గుల తయారీకి, ఇటుక బట్టీలకు, సామిల్లులకు తరలిస్తున్నారు. పెద్ద పెద్ద వృక్షాలను నరికి తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ, మండలంతోపాటు హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, మద్దూర్, దూళిమిట్ట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో దర్జాగా చెట్లను నరికి అక్రమార్కులు లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ, రెవెన్యూశాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ఫిర్యాదులు అందినప్పుడు తూతూమంత్రంగా తనిఖీలు చేసి, తర్వాత మామూళ్లు తీసుకుంటూ అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చెట్లను నరికితే చర్యలు

\- మధుసూదన్, తహసీల్దార్, అక్కన్నపేట

అనుమతులు లేకుండా చెట్లను నరికితే చర్యలు తీసుకుంటాం. వనమహోత్సవంలో నాటిన చెట్లను నరికిన జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా చెట్లను నరికి వేస్తే అట్టి సమాచారాన్ని అందించాలి.

వృద్ధుల కోసం ఏర్పాట్లు చేయలేరా?

● 'ప్రజావాణి'లో సిబ్బంది తీరుపై సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అసహనం

సంగారెడ్డి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కోసం వచ్చే వృద్ధుల కోసం కనీస ఏర్పాట్లు చేయలేరా అని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సోమవారం కలెక్టరేట్ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు ట్రై సైకిల్ లేక గేటు నుంచి చాంబర్ వరకు వచ్చేందుకు పడుతున్న ఇబ్బందులను చూసిన కలెక్టర్ ఏర్పాట్ల తీరుపై మండిపడ్డారు. కనీసం కనీసం వృద్ధుల కోసం మూడు చక్రాల బండి కూడా ఏర్పాటు చేయలేదని అసంతృప్తికి గురయ్యారు. ఇదిలా ఉండగా ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజారాణి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న హంగర్గ.బి రైతులు

మా భూములు మాకు ఇప్పించాలి

నారాయణఖేడ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీ నిర్మించకుండా ఆ భూములను ఇతరులకు విక్రయించేందుకు యత్నిస్తున్నారని, తమ భూములు తమకు ఇప్పించాలని కోరుతూ హంగర్గ.బి గ్రామానికి చెందిన రైతులు సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. హంగర.బిలోని 35 మంది రైతుల నుంచి 160 ఎకరాలను 2006లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు తక్కువ రేటుకు కొనుగోలు చేశారని, కర్మాగారం నిర్మిస్తామని మభ్యపెట్టారన్నారు. ప్రస్తుతం నిర్మించక పోగా, భూములను అమ్ముకోవడానికి యత్నిస్తున్నారని, ఆ భూములను తమకు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, రైతులు బాబుశెట్టి, శ్రీకాంత్, అంజిరెడ్డి, చాంద్‌సాబ్, మారుతి, బీమానాయక్, తదితరులు ఉన్నారు.

సిద్దిపేట ప్రజావాణికి 154 అర్జీలు

సిద్దిపేట నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అర్జీలను త్వరగా పరిష్కరించాలని సిద్దిపేట కలెక్టర్ కే. హైమావతి అధికారులకు సూచించారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 154 అర్జీలను స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని, ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో 77 వినతులు

మెదక్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 77 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయండి

● సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను ఓపికగా విని, పరిష్కారంలో జాప్యానికి గల కారణాలకు సంబంధించి ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

మెదక్ పోలీసు ప్రజావాణికి 13 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

బైలెల్లుదాం.. బండమీది జాతరకు

● రామునిబండ ఆలయంలో నేటి నుంచి కార్తీక ఉత్సవాలు



విద్యుత్ వెలుగుల్లో ఆలయం

జగదేవ్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగంరెడ్డిపల్లి సమీపంలో బండపై వెలిసిన సీతారాములు ఆలయంలో ప్రతీ ఏటా కార్తీక పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. బండపై సీతారాములు వెలవడంతో బండమీద జాతరగా పిలుస్తుంటారు. ఈ జాతరకు జగదేవ్‌పూర్, గజ్వేల్, కొండపాక, సిద్దిపేట, ములుగు, చేర్యాల, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయం ముందు ఉన్న గుండంలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే సర్వరోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం. మంగళవారం నుంచి గురువారం వరకు కొనసాగే జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్, అర్చకులు నర్సింహాచార్యులు, జగన్, శ్రీనివాసచార్యులు తెలిపారు. నేడు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మూడు రోజులు ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్వ్యూ

ఈ నెల 15న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కంగ్టి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కంగ్టి సీఐ వెంకటరెడ్డి కోరారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు మంచి అవకాశం అన్నారు. ఈ నెల 8 నుంచి 15 వరకు కోర్టులో హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు నిజాంపేట విద్యార్థి ఎంపిక

నిజాంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలుర స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాల, బాలికల క్రీడల్లో నిజాంపేటకు చెందిన విద్యార్థి ప్రతిభ కనబరచాడు. ఉమ్మడి మెదక్ జిల్లా రగ్బీ ఎంపికలో నిజాంపేట మండల కేంద్రానికి చెందిన విద్యార్థి కార్తీక్ గౌడ్ ఎంపికైనట్టు నిజాంపేట జిల్లా పరిషత్ హై స్కూల్ పీజీ హెచ్‌ఎం జ్ఞానమాల, పీడీ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో మహబూబాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

బోరు ప్రారంభం



సీతారాం తండాలో బోరును ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ మహేష్ గుప్తా

శివ్వంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మాజీ జెడ్పీటీసీ మహేష్ గుప్తా పేర్కొన్నారు. మండల పరిధిలోని సీతారాం తండాలో ఎదుర్కొంటున్న నీటి సమస్యను గిరిజనులు మహేష్‌గుప్తా దృష్టికి తీసుకువెళ్లడంతో మహేష్ గుప్తా సొంత నిధులతో తవ్వించిన బోరుబావికి సోమవారం మోటారుబిగించి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోని రవి నాయక్, నాయకులు ఉన్నారు.

కొల్లూరు డబల్‌బెడ్ రూమ్ ప్రాంగణంలో సౌకర్యాలేవి



సాయిచరణ్‌గౌడ్

రామచంద్రాపురం టౌన్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాలగోని సాయిచరణ్‌గౌడ్ విమర్శించారు. 15,600 ఇళ్లకు ఇప్పటికే 80శాతం మంది ఇళ్లలోకి చేరారని గుర్తు చేశారు. నిరుపేదలకు ఉచితంగా తాగునీటిని సరఫరా చేయకుండా బిల్లులు వసూళ్లు చేయడానికి అధికారులు ప్రయత్నించడం మంచి పద్ధతి కాదని వివరించారు. కరెంటు సరఫరా పూర్తిస్థాయిలో జరగకపోయినా చార్జీలు వసూళ్ల చేస్తున్నారన్నారు. మెయింటెనెన్స్ చార్జీల విషయంలో రోజువారిగా జీవనం సాగిస్తున్న వారి నుంచి నెలవారిగా వెయ్యి రూపాయల వరకు వసూళ్ల చేస్తున్నారన్నారు. ఒక వ్యక్తికి ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సమయానికి ఆసుపత్రికి చేరుకోలేక మార్గ మధ్యలోనే చనిపోయాడని తెలిపారు. అంబులెన్స్‌ల సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై మంత్రులు దృష్టి సారించాలని చెప్పారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి



అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బస్సు ప్రమాదం సంఘటనలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం రామచంద్రాపురంలో విలేకరులతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మీర్జాగూడ వద్ద సోమవారం బస్సు ప్రమాదం సంఘటనలో 20 మంది మృతి చెందారని వివరించారు. చాలా మంది గాయాలపాలయ్యారని వివరించారు. గాయపడిన వారికి రూ.2లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. కంకర తీసుకువెళుతున్న లారీపై టార్పాలిన్ కవర్ వేసి ఉంటే ప్రమాదం తక్కువ జరిగి ఉండేదని తెలిపారు.

ఖేడ్‌లో నేడు సీజ్ చేసిన వాహనాలు, మొబైల్ ఫోన్ల వేలం

నారాయణఖేడ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఖేడ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, మొబైల్ ఫోన్లను మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి సోమవారం తెలిపారు. వేలం వేయనున్న వాటిలో 5 ద్విచక్ర వాహనాలు, 8 ఫోన్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 8712658915 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ఖేడ్ నుంచి శబరిమలైకు పాదయాత్ర

నారాయణఖేడ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నుంచి అయ్యప్ప దీక్ష చేపట్టిన దీక్షాదారి సున్నపు భవానీకుమార్(లక్కి) సోమవారం కేరళలోని శబరిమలైకి పాదయాత్రగా బయలు దేరాడు. ఈ సందర్భంగా ఇప్పటికే అయ్యప్ప దీక్షలు చేపట్టిన దీక్షాదారులు, గురుస్వాములు, భక్తులు లొంక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శబరి మలైకి వెళ్తున్న సున్నపు భవానీ కుమార్‌కు మంగల్‌పేట వరకు వీడ్కోలు పలికారు.

లింకు రోడ్డు నిర్మాణంతో ఖేడ్‌కు మహర్దశ



నల్లవాగు ప్రాజెక్టు వద్ద మత్స్యకారులు, రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రింగు రోడ్డు నిర్మాణంతో ఖేడ్ పట్టణానికి మహర్దశ రానున్నదని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ పట్టణ శివార్లులో చుట్టు ఉన్న రింగు రోడ్డులో రూ.40 లక్షల జిల్లా మైనింగ్ ఫండ్‌తో నిర్మించనున్న ఆరు కల్వర్టు పనులకు సోమవారం ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఖేడ్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. ఖేడ్ పట్టణం చుట్టు ఉన్న సీసీతో రోడ్ల విస్తరణ, విశాలమైన మురుగు కాల్వలు, రోడ్ల మధ్యలో డివైడర్లు, మూడు చౌక్‌లు సుందరీకరణకు రూ.16.38 కోట్లు మంజూరయ్యాయన్నారు. మొదటి విడత హ్యామ్ కింద ఆర్‌అండ్‌బీకి సంబంధించిన పలు రోడ్ల విస్తరణ, బలోపేతానికి రూ.120 కోట్లు, పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.56 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద పలు తండాలకు రోడ్ల కోసం రూ.5 కోట్లు, అర్బన్ పార్కుకోసం రూ.3.09 కోట్లు, ఖేడ్ డంపుయార్డులో ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ కోసం రూ.40 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే నీటి పారుదల శాఖ పనులకు రూ.200 కోట్లు, ఆర్డీవో, తహసీల్ కార్యాలయాలు, అధికారుల నివాస సముదాయానికి రూ.12కోట్లు, క్రీడాప్రాంగణాలకు రూ.20 కోట్లు, మంజూరు కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, తాజామాజీ కౌన్సిలర్లు రామక్రిష్ణ, మాజీద్, హన్మండ్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహేర్ అలీ, సాయిలుపటేల్, పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్, గౌస్‌చిస్తీ, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి చేయూత

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం అనేక రకాలుగా కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగానే నాణ్యమైన ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నదని ఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టులో 11లక్షల వివిధ రకాల చేపపిల్లలను ఉచితంగా ఎమ్మెల్యే వదిలిపెట్టారు. అనంతరం ప్రాజెక్టు అతిథి గృహం వద్ద జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో ఆలస్యమైనా నాణ్యమైన చేప పిల్లల విత్తనాలను మత్స్యకారుల సహకార సంఘాలకు పంపిణీ చేస్తున్నామన్నారు. సంగారెడ్డి జిల్లాలోనే మొట్టమొదటగా నల్లవాగు ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలిపెట్టామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సహకార శాఖ ఏడిఏ మధుసూదన్, ఆత్మ కమిటి మాజీ చైర్మన్ గుండు నరేందర్, నల్లవాగు మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు రవిందర్, నాయకులు యాదవరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావ్, జయరాజ్, రవి పటేల్, విటల్, క్రిష్ణ, జమీల్ నీటిపారుదల శాఖ ఏఈలు శ్రీవర్ధన్‌రెడ్డి, మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం



తూప్రాన్‌లో ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఈ గరత్మంత్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పలు డివిజన్ల పరిధిలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా వినియోగదారుల సమస్యలపై వినతులను స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఇందులో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో వినియోగదారుల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ కో ఎస్ఈ నారాయణ నాయక్ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల తక్షణ పరిష్కారమే తమ లక్ష్యమని తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 102 అర్జీలు అందాయన్నారు. ఇందులో 15 ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈ శ్రీనివాస్ విజయ్, ఏడీఏ, విజిలెన్స్ డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈలు నవీన్ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● **తూప్రాన్:** తూప్రాన్ విద్యుత్ సబ్ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమావేశంలో 23 దరఖాస్తులు స్వీకరించినట్లు తూప్రాన్ విద్యుత్‌శాఖ డీఈ గరత్‌మంత్ రాజ్ తెలిపారు. తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఇందులో తూప్రాన్ మండలం నుంచి 21 వినతులు రాగా, శివ్వంపేట, వెల్దుర్తి మండలాల నుంచి ఒక్కొక్క .వినతి చేసినట్లు తెలిపారు. సదస్సులో ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు పాల్గొన్నారు.

● **పాపన్నపేట:** పాపన్నపేటలో నిర్వహించిన సబ్ డివిజన్ స్థాయి వినియోగదారుల సదస్సులో ఏఈ నర్సింలు మాట్లాడుతూ.. వినియోగదారులకు సమస్యలు ఉన్నట్లయితే, తమ దృష్టికి తేవాలని కోరారు పాపన్నపేట సబ్ డివిజన్ పరిధిలో 5 మండలాలు ఉండగా 16 దరఖాస్తులు వచ్చాయి. వినియోగదారులకు సమాచారం, అవగాహన కరువై సరైన స్పందన రాలేదని తెలుస్తుంది.పాపన్నపేట మండలం నుంచి 11, టేక్మాల్ మండలం నుండి 1,అల్లాదుర్గం నుంచి 4 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

కోర్టు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయండి



ఎంపీ రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్నట్టు న్యాయవాదులు

తూప్రాన్/వెల్దుర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మెదక్ ఎంపీ రఘునందన్‌రావును సోమవారం న్యాయవాదులు, వెల్దుర్తికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం వేర్వేరు కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతులు సమర్పించారు. తూప్రాన్ పట్టణానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పాటుకు, భవన మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని న్యాయవాదులు కోరారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. పాత ఎంపీపీ కార్యాలయంలో కోర్టు ఏర్పాటుకు నిర్ణయించగా, మరమ్మతులకు కావలసిన నిధుల గురించి రోడ్లు భవనాలశాఖ అధికారులు ప్రతిపాదనలు చేసి కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు. కోర్టు ఏర్పాటుకు భవన మరమ్మతులకు అవసరమైన నిధులు అందజేయాలని కోరగా ఎంపీ సానుకూలంగా స్పందించి ఎంపీ కోటా నిధుల నుంచి రూ. 15లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో న్యాయవాదులు ఎం. అశోక్, బొడ్డు శ్రీనివాస్, జే. వేణుగోపాల్‌చారి, జి. ఆనంద్, శివకుమార్, అభిషేక్‌కుమార్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా వెల్దుర్తి నుంచి మెదక్ వరకు 24 కిలో మీటర్ల వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్దుర్తి బీఆర్ఎస్ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును కలిసి విన్నవించారు. వెల్దుర్తి మండలంలో నిలిచిన అభివృద్ధి పనులను, సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఎంపీని కోరారు. స్పందించిన ఎంపీ ఈనెల 11 తరువాత మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి రోడ్డును పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని ఎంపీ హామి ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలి



అయ్యప్ప ఆలయ శంకుస్థాపనలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్యులు నిత్యం సేవాదృక్పథంతో పని చేసినప్పుడే వృత్తికి సార్థకత చేకూరుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోగులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా విధులు నిర్వహించాలన్నారు. ఆసియాఖండంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన ఈ ఆస్పత్రిలో అందుకు తగినవిధంగా నాణ్యమైన సేవలందించాలని సూచించారు. రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యుల నియామకం చేపట్టాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కోరనున్నామన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ చంద్రశేఖర్, ఆర్‌ఎంవో ప్రవీణ, సభ్యులు బాలగోని రాములుగౌడ్, కంకర సీనయ్య, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

రూ.1.35కోట్ల అంచనాతో అయ్యప్ప ఆలయ నిర్మాణం

అమీన్‌పూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బీరంగూడ గుట్టపై రూ.1.35కోట్ల ప్రాథమిక అంచనాతో అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గుట్టపై ఆలయ శంకుస్థాపన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తన హయాంలో నియోజకవర్గంలో సుమారు 200ఆలయాలను నిర్మించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. రూ.1.35కోట్ల ప్రాథమిక అంచనాతో చేపట్టనున్న ఆలయంలో భక్తులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పూజా కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మెన్ నర్సింహగౌడ్, మాజీ ఎంపీపీ, గురుస్వామి కొత్తకాపుసం జీవరెడ్డి, నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో హరీశ్‌రావును పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హరీశ్‌రావుకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

మనోహరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావును మనోహరాబాద్ బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. వారం రోజుల క్రితం హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు కన్ను మూసిన విషయం తెలిసిందే. దీంతో మండల బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ కోకాపేటలో గల హరీశ్‌రావు నివాసంలో పలువురు కలిసి పరామర్శించారు. ఇందులో మెదక్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేణుకుమార్, సర్పంచ్ పూల అర్జున్ పురం రవి, లక్ష్మణ్‌సింగ్ ఠాగూర్, సాయి, నాయకులు ఉన్నారు.

రేర్ సీల్స్ పరిశ్రమకు నోటీసు జారీ

హత్నూర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చందాపూర్ గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న రేర్ సీల్స్ పరిశ్రమకు గ్రామ పంచాయతీ కార్యదర్శి రిజ్వాన్ సోమవారం నోటీసు జారీ చేశారు. పూర్తిస్థాయి అనుమతులు పొందే వరకు నిర్మాణాలు పూర్తిగా నిలిపి వేయాలని నోటీసులో పేర్కొన్నారు.

తాటిపల్లి వైన్స్‌కు డ్రా..

మునిపల్లి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో మొత్తం 101వైన్స్‌లు ఉండగా ఇందులో తాటిపల్లి వైన్స్ మినహా మిగితావాటన్నింటికి గత నెల 27న లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాలను కేటాయించిన విషయం తెలిసిందే. అయితే మునిపల్లి మండలం తాటిపల్లికి చెందిన షాపునెంబర్ 24కు సంబంధించి 20దరఖాస్తులు రావల్సి ఉండగా ఇందులో 19దరఖాస్తులు రావడంతో వాయిదా పడింది. కాగా గత నెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించగా శనివారం నాటికి మొత్తం 97దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో నిర్వహించి మద్యం దుకాణానికి సంబంధించి డ్రా తీశారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలం దుర్గంచెరువు గ్రామానికి చెందిన గౌండ్ల వెంకటేశంగౌడ్ దక్కించుకున్నాడు.

కార్మికుల అక్రమ బదిలీ నిలిపి వేయాలి

జిన్నారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో యూనియన్ ఏర్పాటు చేశారని కార్మికులను మరో ప్లాంటుకు బదిలీ చేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డీఆర్వో పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. సోమవారం సీఐటీయూ రాష్ట్రకమిటీ సభ్యుడు రాజయ్య డీఆర్వోను కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపల్లి శ్రీరామ పరిశ్రమలో చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేయగా.. యాజమాన్యం 13 మంది కార్మికులను ఏపీలోని ప్లాంటుకు బదిలీ చేసి వేధింపులకు పాల్పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కాలనీల్లో సీసీరోడ్లకు ప్రత్యేక నిధులు



శ్రీనివాస్‌నగర్‌లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయని కార్పొరేటర్ పుష్పానగేష్ చెప్పారు. ఈ మేరకు సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో రూ.35లక్షల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో ప్రాధాన్యతక్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సీసీరోడ్లు పెద్దఎత్తున వేయించడానికి నిధులు మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో మల్లేశం, అశోక్, సత్యనారాయణ, సురేందర్, మహేందర్, యాదయ్య, తదితరులు ఉన్నారు.

పశువులకు 'గాలికుంటు' నిరోధక టీకాలు

నాగల్‌గిద్ద, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడూరు గ్రామంలో సోమవారం నాగల్‌గిద్ద పశువైద్యాధికారి డాక్టర్ రహీం ఆధ్వర్యంలో సుమారు 200 పశువులకు గాలికుంటూ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ముందస్తుగా ఎలాంటి రోగాలు రాకుండా పశువులు కలిగి ఉన్న ప్రతి రైతులు గాలి కుంటు టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు.

మహిళా సంఘం సభ్యులు ఆర్థికంగా ఎదగాలి

నాగల్‌గిద్ద/మనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళా సమైక్య సంఘం సభ్యులు ఆర్థికంగా ఎదగాలని నాగల్‌గిద్ద ఐకేపీ ఏపీఎం నర్సింలు పేర్కొన్నారు. సోమవారం నాగల్‌గిద్ద, మనూరు మండలాల్లో ఐకేపీ కార్యాలయాల్లో ఆయా మండలాల పరిధిలోని ఆయా గ్రామాల సమైక్య సంఘం సభ్యులకు వేర్వేరుగా విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో మండల సమైక్య సంఘం అధ్యక్షులు హీనబేగం, ఐకేపీ సీసీలు తదితరులు పాల్గొన్నారు. మనూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎం అనంతయ్య, సంజీవ్‌కుమార్, ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. చివరి గింజా కొంటాం: మెదక్ ఎమ్మెల్యే



పాపన్నపేట మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న మెదక్ ఎమ్మెల్యే

పాపన్నపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : రైతులు అధైర్య పడవద్దు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లాపూర్, అన్నారం, యూసుఫ్‌పేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. అనంతరం మల్లంపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన తరుణ్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయన మాట్లాడుతూ.. సన్న వడ్లకు బోనస్ కూడా త్వరలో అందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వబ్బతి ప్రభాకర్ రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు గోవింద్ నాయక్ పాల్గొన్నారు

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడండి

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశించారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేసీఆర్ పాలనలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీలు మనోహర్‌గౌడ్, కొండల్‌రెడ్డి, మాజీసర్పంచ్ గోనెల రఘు, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి పాల్గొన్నారు.

13 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు



సుల్తాన్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

పుల్‌కల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యాన్ని సేకరించేందుకు 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ తెలిపారు. మండలంలోని కోర్పోలు, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో సోమవారం ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డితో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దాదాపుగా మండలంలోని అన్నీ గ్రామాలలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ కో ఆర్డినేటర్ వంశీ, ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మయ్య, కార్యదర్శి పావని, నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేశ్, రాజశేఖర్, వర్కల రమేశ్, సంజయ్, మల్లికార్జున్‌గౌడ్, శివరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

చౌటకూర్‌లో సన్న ధాన్యం సేకరించాలి

పుల్‌కల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లో సన్న వరి ధాన్యం సేకరించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం నయాబ్ తహసీలార్ శ్రీమాన్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్‌లో అనేక మంది రైతులు సన్న వరి ధాన్యాన్ని సాగు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం తీసుకునేందుకు నిర్వాహకులు నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో సన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. వినతి పత్రం అందజేసినవారిలో రైతులు తలారి దేవయ్య, నరేందర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, రాజు, వెంకటేశం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం



జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారంలో మంత్రి పొంగులేటి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మనోహరాబాద్ మండల నాయకులు

మనోహరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌తో కలసి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మనోహరాబాద్ మండల నాయకులు ఇంటింటి ప్రచారంలో పాలొన్నారు. జూబ్లీహిల్స్‌లోని రహమత్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో తూప్రాన్, మనోహరాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మామిళ్ల కృష్ణ, జింక మల్లేష్, ప్రభాకర్‌రెడ్డి, ఐలయ్య యాదవ్, వేంకటేష్ యాదవ్, అనిల్, అజయ్ ప్రచారంలో పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే చెల్లించాలి



జహీరాబాద్‌లో విద్యార్థిసంఘాల ఆందోళన

జహీరాబాద్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్పులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ, ఏబీవీపీ, తదితర విద్యార్థుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జహీరాబాద్ పట్టణంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయా విద్యార్థిసంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.8,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను నిలిపివేయడంలో నిరుపేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు వెళ్లి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏబీవీపీ, పీడీఎస్‌యూ విద్యార్థిసంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **పాపన్నపేట :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పాపన్నపేటలో జూనియర్ కళాశాల విద్యార్థులు మెదక్-బొడ్మట్పల్లి రహదారిపై పాపన్నపేటలో ఏబీవీపీ అధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో బస్సులు, ఇతర వాహనాలు ఆగిపోయాయి. పోలీసులు ఘటనా స్థలికి వచ్చి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు

జహీరాబాద్‌లో ఘనంగా సదర్ ఉత్సవాలు



సదర్ ఉత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్‌లో ఆదివారం రాత్రి గొల్లకుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో వివిధ పార్టీల నాయకులు, పట్టణప్రముఖులు, అధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్‌సీనియర్ నాయకులు డా.సిద్ధంఉజ్వల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.